# విజేత

"ఏరా విష్ణూ ఈ అమ్మమ్మని లోనికి రానివ్వకుండా ఇనుప తలుపులు బిగిస్తావా? నేనెవర్నిరా?! మీ అమ్మ కడుపున నువ్వు పడ్డావోలేదో! అది నాకన్న కూతురే అయినా దానికి నేచేసిన సేవలన్నీ నీకోసమే కదరా! మనవడు పుట్టాడని నేపడ్డ సంబరం అంతా ఇంతా నటరా!! పంచదార చిలుకలతో, దబ్బకాయంతంత మిఠాయుండలతో ఊరందరి నోళ్ళు తీపి చేశాను. నాబంగారు కొండవని నాఒంటిమీద బంగారం అంతా కరిగించి మురుగులు, గొలుసు, మువ్వల మొలతాడు, పులిగోరు పతకం, వేళ్ళకు ఉంగరాలు. అన్నిటితో నిన్ను ముస్తాబు చేసి ఎంత మురిసి పోయాను. నన్ను యశోదమ్మను చేసిన బాల కృష్ణునివని మమతలన్నీ రంగరించి ఎన్ని జోలలు పాడానో. నువ్వు పెరుగుతుంటే నీచుట్టూ ఎన్ని ఆశలు అల్లుకున్నాను. నీ అల్లరి భరించలేక మీ అమ్మ రవ్వంత చిరాకు పడ్డా, వెర్రి నాగమ్మ అంటూ వెనుకేసుకొచ్చి నిన్ను బుజ్జగించిన అమ్మమ్మని. ఓసారి పరీక్ష తప్పావని మీనాన్న నీమీద చెయ్యి చేసుకుంటే నాలుగు రోజులు అన్నం మానేసి అల్లుడి మీద యుద్ధం ప్రకటించాను.!

అమ్మమ్మ మాటలు వింటున్నాడు. తను ఔను ఔనే అమ్మమ్మ. అన్నీ గుర్తున్నాయే. నీ గారాబం వల్లే నేను చెడుతున్నానని అప్పుడు అమ్మానాన్న అనుకున్నారు. నిన్ను ఇంట్లోంచి పంపించేస్తే తప్ప, నేను బాగుపడనని, ఆ ప్రయత్నమూ చేశారు. అమ్మో అమ్మమ్మ లేకుండా ఒక్క రోజైనా ఉండగలనా? ఎంత భయపడ్డానో. వెంటనే అమ్మానాన్న కాళ్ళ మీద పడిపోయి అలా చేయవద్దని బతిమాలుకున్నాను. ఇకనుంచి ఫస్టు క్లాసు తెచ్చుకుంటానని, అసలు అల్లరే చేయనని వాళ్ళకి వాగ్దానం చేశాను. నేను బ్యాంకాఫీసర్నయి ఇంత హోదాలో తృప్తిగా జీవించటానికి కారకురాలివి. ముమ్మాటికీ నువ్వేనే, అమ్మమ్మా!.... అమ్మమ్మ నేను నిన్ను రావద్దంటానా? తల్లి తండ్రి గురువు నాసర్వస్వం నువ్వే అయినప్పుడు నిన్ను పొమ్మని ఎలా అనగలను? ఎప్పటికీ అనలేను. ఈతలుపులు బిగిస్తున్నది నేను కాదు. అందుకే నువ్వు ఎలా

అయినా పగలగొట్టి వచ్చేయవే అమ్మమ్మా!! ఏడుస్తున్నాడు విశ్వం. అరుస్తున్నాడు జుట్టు పీక్కుంటున్నాడు. ఒక్క సారిగా కళ్ళు తెరిచిన అతను దిగ్గున లేచి కూర్చున్నాడు.

ఏమిటిది? అమ్మమ్మ ఏది? అమ్మమ్మ కోరిక తీర్చలేనేమో అన్న వ్యాకులతతో మెలుకువగానే ఉన్నాడు ఏక్షణాన నిద్రతెరలు వాలాయో! ఎంతలో అమ్మమ్మ కలలోకి వచ్చిందో...... నిట్టూర్చాడు. ఒక్కసారి భార్యముఖంలోకి చూశాడు. నిశ్చింతగా నిద్రపోతుంది. ఆమె పట్టుదల నెగ్గి తీరుతుంది. అన్న దృఢ నిశ్చయం, అహంకారం, ప్రస్ఫుటమౌతున్నాయి. ఆమె ముఖంలో ఈ పరిస్థితి వచ్చేదాకా అతడు గమనించనేలేదు! ఈ మోస్తరు భావాలు విజేత గుండెలో ఉన్నాయని.

తను కాపురానికి వచ్చిన దగ్గర నుంచి రోజొక్క మధురిమగా కరిగిపోయింది. తాను ఏ డ్రెస్ వేసుకోవాలో, క్రాపు ఎలా ఉండాలో అన్నీ విజేత నిర్ణయిస్తుంటే చిలిపితనం అనుకున్నాడు. తను మాత్రం పార్టీలకు, షికార్లకు, సినిమాలకు, తయారైనప్పుడు ఆమె అలంకరణ విషయంలో మాత్రం అతని మాట వినేది కాదు. పోనీలే చిన్నపిల్ల, తనెందుకు ఆమె ఇష్టాల్ని కాదనాలి? అనుకున్నాడు. సామాన్య గృహిణిలా కాక ఆధునికతకు ప్రాధాన్యత ఇస్తున్నా తరచు బ్యూటీపార్లర్‌కు వెళ్ళొస్తున్నా స్నేహితురాళ్ళతో కాలయాపన చేస్తూ ఎన్నోసార్లు -

"వండటానికి కుదరదు క్యారేజీ తెచ్చేద్దురూ" అన్నా ఇవేమీ పెద్దగా పట్టించుకోలేదు. ఇరవై ఏళ్ళు నిండగానే ఇల్లాలైపోతే ఇంతేమరి బాధ్యతలు ఏం తెలుస్తాయి? సరిపెట్టుకున్నాడు. వెన్నెలంతా చల్లగా నవ్వుతూ ఒయ్యారంగా మల్లె తీగలా అల్లుకుని తనలో తీయని ఊహలు రేపి అల్లరి చేసే శ్రీమతి అంటే చెప్పొద్దూ.... తనకు పిచ్చి ప్రేమ ఆ ప్రేమలో తనను తనే మర్చిపోతాడు. ఇంత అందాన్ని మీ సొంతం చేశానే. మరి నాకు ఏం బహుమతి ఇస్తారు?" గోముగా అనేది. "బహుమతి అందుకోవలసింది నేను. బెట్టు చాలుగాని తొందరగా మన వలపుల కానుకని నువ్వే నాకియ్యి. ఇద్దరం ముగ్గురమైపోదాం." అతని అంతరంగంలో ఆశ ఆమె చెవుల్లో గుసగుసలు పోయేది. నిలువెల్లా సిగ్గుతెరలు కమ్ముకొని భర్త చేతిలో పులకించిపోతూ "ఆసమయం రావాలి కాని మీ అల్లరి అంతా మూటకట్టి మిమ్మల్ని ఆటపట్టించే అబ్బాయికి నాన్నని చేసేయనూ!! అంది. అప్పుడు భార్యమాటల్లో అంతరార్థమేమిటో అవగతం కాలేదు. ఆలోచిస్తున్నాడు విశ్వం. అతనికి ఏమీ పాల్పోవడంలేదు. ఆమె అభిప్రాయాన్ని మార్చాలని. లాలించి బుజ్జగించి ఎంతో ప్రయత్నించాడు. ససేమిరా మీ మాట విననంది. మళ్ళీ విశ్వం కళ్ళల్లో అమ్మమ్మ రూపం కదలాడింది. విజేత తనమాటే సాగాలంటే అమ్మమ్మ తిరిగి తన ఇంటికి వచ్చేదారి లేదు. తనన్ని ఉయ్యాలలూపి పెంచిన అమ్మమ్మ తన ఇంట ఉయ్యాల ఊగుతానంటోందే! అమ్మమ్మని తన బిడ్డగా లాలించి పెంచే అవకాశం అదృష్టం చేజారిపోతాయా? "ఒరే విశ్వూ... చంటి పిల్లాడిలా ఏడుస్తావేంరా. ఈ ముసలి ప్రాణం ఇంక ఉండదు. నువ్విలా పిచ్చివాడివై పోకు. చచ్చినా నేనెక్కడికీపోనూరా. నువ్వు పెళ్ళి చేసుకో నేను నీకడుపున పుడతాను. అమ్మమ్మ అంటే నీకున్న ఆపేక్ష, అభిమానులతో ఆప్యాయంగా నీకూతురిని పెంచు. నీ ఒళ్ళో ఆడుకునేది. నీచేతి గోరుముద్దలు తినేది అన్నీ నీ అమ్మమ్మేరా. వెర్రివాడా!

నిన్నొదిలి నేనెక్కడికి పోతాను". చివరిక్షణాల్లో అమ్మమ్మ తనతో అన్నమాటలు. చెవుల్లో రింగుమంటున్నాయి.

విజేత కడుపులో ఊపిరి పోసుకొంటున్న అమ్మమ్మ తన ఒడిలోకి వచ్చి తీరాలి. పదే పదే అనుకోసాగాడు.

"బాగున్నావా తల్లి"! ఆటోదిగి లోనికి వస్తూనే కూతుర్ని కౌగిలించుకొంది విమల. హఠాత్తుగా వచ్చిన తల్లిని చూసి విజేత రవ్వంత ఆశ్చర్యపోయింది".

"నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నా" అంది యధాలాపంగా "ఆపనేదో అల్లుడుగారు చేశార్లేమ్మా". తల్లి మాటకి ఉలిక్కిపడింది.తనూహించింది నిజమేనన్న మాట. అనుకున్నంత పనీ చేశాడు మహానుబావుడు. ఛీ. ఛీ. విషయం తల్లి దాకా రాకుండా గుట్టుగా కానిచ్చేద్దామనుకుంది. విశ్వం శత్రువులా తోచాడు. తనతో మాట మాత్రం చెప్పకుండా... ఏమిటి? ఇతగాడు చేసిన పని. "ఏమిటే అలా చూస్తావ్? నీకిప్పుడు విశ్రాంతి అవసరం, పద లోపలికి" విజేత చెయ్యి పట్టుకొని బెడ్రూమ్ వైపు నడిచింది. విశ్వం అత్తగారిని ఆత్మీయంగా పలకరించాడు.

"నీకెందుకు నేనున్నానుగా" అని అభయమిస్తున్నట్లు చూసిందావిడ. విశ్వం అత్తగారు చేతి భోజనం చేసి తృప్తిగా ఆఫీసుకి వెళ్ళిపోయాడు. తల్లితో ఏం మాట్లాడాలో తోచడం లేదు. విజేతకి అంతా అయోమయంగా ఉంది. పళ్ళరసం గ్లాసుతో కూతురి దగ్గరకు వచ్చింది విమల - "భోజనం సరిగ్గా చేయలేకపోయావు తీసుకో తల్లి". విజేత పక్కనే కూర్చొని ఆమె తల నిమిరింది. "తొలిసారి నెలతప్పావు. పైగా పసిపిల్లవి. ఓ రెండు వారాలు ఆకాలేజీకి శెలవు పడేసి నిన్ను చూసుకుందామనే వచ్చాను."

విజేత తల్లికళ్ళల్లోకి తీక్షణంగా చూసింది. "నువ్వేం ముద్దు చేయనక్కర్లేదు. నేనేం పసిదాన్నీ కాదు".

"ఔన్లే, నాదే పొరపాటు. నువ్వు చాలా ఎదిగిపోయావే॥

"అదీ అలా వచ్చేయమ్మా దారికి. ఇక నాయిష్టం నాది. మీ ఎవ్వరి చేత చెప్పించుకునే స్థితిలో లేను. తల్లిగా నీకు నామీద ఏకాస్త ప్రేమ ఉన్నా ముందు నా అబార్షన్ సంగతి చూడు."

"విజేత చెంప చెల్లుమంది". ఏమిటే నోటికొచ్చినట్టు పేలుతున్నావు. "నువ్వెలా అనుకుంటే అలా జరిగి పోవాలా. పుట్టబోయే బిడ్డ మీద నీభర్తకేమీ హక్కు లేదంటావా? విశ్వం వద్దంటున్నా స్కానింగ్ చేయించుకున్నావు. ఆడపిల్లని కనను గాక కనను అని మొరాయిస్తున్నావు నీ పట్టుదలతో అతని మనస్సు ఎంత గాయపడుతుందో ఆలోచించవేం?"

తల్లి కొట్టిన చెంప దెబ్బకు గాని, ఆవిడ మాటలకు గాని చలించలేదు విజేత - "చూడమ్మా నువ్వెన్ని చెప్పినా ప్రయోజనం ఉండదు. నేను ఆడపిల్లకి తల్లిని కాదల్చుకో లేదు. కాను. అంతే. హాయిగా మగ బిడ్డకి జన్మనిచ్చి ఆ మాతృత్వంలో గర్వాన్ని పొందుతాను. ఆడపిల్లని

కంటే ఒరిగేదేమిటమ్మా. అది ఎదుగుతున్న కొద్దీ, ముందు ఇల్లు స్వేచ్ఛకు సంకెళ్ళు పడతాయి. ఎంత సేపు దాని కనిపెట్టి ఉండాలి. ఎంత చదివించినా. ఉద్యోగస్తురాల్ని చేసినా ఎక్కడ తప్పటడుగు వేస్తుందో అని అహర్నిశలు ఆడపిల్ల, తల్లి బెంగే కదమ్మా! తన సుఖసంతోషాలు., సరదాలు, ఫణంబెట్టి, క్షణ క్షణం సమాజానికి భయపడుతూ కంటికి రెప్పలా కాపాడుకోవాలి. ఈ సమాజం ఏదో మారింది, అంటావేగాని అంతా మేడిపండు చందం. లక్షలకి లక్షలు కట్నాలు కుమ్మరించినా అత్తింట ఆడపిల్ల ప్రశాంత జీవితాన్ని గడుపుతుందన్న హామీ ఇవ్వగలవా? ఇవన్నీ నీకు మాత్రం తెలియనివా? ఆలోచించవలసింది నేను కాదమ్మా. నువ్వూ, మీ అల్లుడుగారూ" అంది ఆవేశంగా. ఎంత తేగేసి చెబుతున్నావే ఆడపిల్లని కని అష్టకష్టాలు భరించలేవని, హు చాలా బాగుందే విజేత. ఆ రోజు నీలా నేను అనుకొని ఉంటే నువ్వీ అందమైన ప్రపంచంలోకి రాగలిగేదానివి కాదు. నా సంసార జీవితం ఇలా విచ్ఛిన్నమయ్యేది కాదు. ఇలా ఒంటరి బ్రతుకీడుస్తూ ఇన్నిపాట్లు పడే దాన్నీ కాదు. నీకోసమే నామనుగడ అస్తవ్యస్తం చేసుకున్నాను. నీతండ్రి చూడక పోయినా, మీనాన్న భావాల్ని పూర్తిగా పునికి పుచ్చుకున్నావే తల్లి".

విస్మయంగా తల్లి ముఖంలోకి చూసింది. "ఔను విజేత. నీకు తెలిసిందంతా నువ్వు నాకడుపులో ఉండగానే నేను మీనాన్న విడాకులు తీసుకున్నాం అన్న విషయం మాత్రమే. కేవలం నీకు జన్మనివ్వటానికి మా ఇద్దరి మధ్య పోట్లాట ప్రారంభమైంది. మా పెళ్ళైన ఐదేళ్ళకి నువ్వు నాకడుపున పడ్డావు. అంత వరకు మాది అన్యోన్య దాంపత్యమే. మీనాన్నగారికి ఏ వ్యసనాలు, మరి ఏ చెడ్డ అలవాటు లేదు. నిజానికి ఆయన నన్ను సుఖపెట్టారనే చెప్పాలి. ఒకరి భావాల్ని మరొకరు గౌరవించుకునే వాళ్ళం. ఒకరి అభిప్రాయాలకు మరొకరు విలువనిచ్చే వాళ్ళం కూడా. పుట్టబోయేది ఆడ మగ అన్న ఆరాటం మీనాన్నగారికి. దాన్ని నేను తేలిగ్గా తీసుకున్నాను. ఎవరైతేనేం మనల్ని అమ్మానాన్నల్ని చేస్తారు. వాళ్ళని మనం అపురూపంగా పెంచి సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాం. తల్లిని కాబోతున్న ఆనందంతో అన్నాను. అప్పుడే ఆయన అసలు స్వరూపం నాకర్థమైంది. అప్పటి ఆయన మాటలు, చేతలు నువ్విప్పుడూ తలపింపచేస్తున్నావ్." విమల గొంతు రుద్ధమైపోతోంది. బలవంతాన పొంగి వచ్చే కన్నీటికి ఆనకట్ట వేస్తోంది. "అంటే! అమ్మా నాన్నగారు నా పుట్టుకకి అభ్యంతరం చెప్పారు." అంత దుఃఖంలోనూ విమలకి నవ్వొచ్చింది.

"ఆడదానివి అయ్యుండీ నువ్వే ఇలా మాట్లాడుతున్నావ్. మీనాన్నగారు నిన్ను వద్దు అనుకున్నారంటే ఆశ్చర్యంగా ఉందా! మగవారిలో ఆనవాలు ఉండటం స్త్రీజాతి వ్యతిరేకించి తీరాలని ఆరోజు నాకన్పించింది. ఆ నిశ్చయంతోనే నాభర్తతో పూర్తిగా తెగతెంపులు చేసుకొని సాహసించి మరీ నిన్నీలోకంలోకి తీసుకొచ్చాను. మూడు పదులు నిండకుండా అన్ని సుఖసంతోషాలు కోల్పోయినా, భర్తను వదిలేసినా, స్త్రీగా సమాజం చేత వేలెత్తి చూపించబడుతున్నా చలించలేదు. నాది ఓటమి అని అంగీకరించనూలేదు. నా విజయానికి

గుర్తుగా నిన్ను అలానే పిలుచుకున్నాను. నిన్ను స్త్రీజాతికే ఆదర్శంగా పెంచానని, ఎంతో సంస్కారవంతురాలిగా తీర్చదిద్దగలిగానని పొంగిపోతున్నాను. నీతీరు చూస్తుంటే నా తల తిరిగిపోతోంది. లేనిపోనిది ఊహించుకుంటూ నీ మనస్సు కలుషితం చేసుకుంటున్నావు. నీ భర్త ఔన్నత్యం నీకు అవగతం కావటంలేదు. అతనికి ఉన్న మమత పాశం ఏ మాత్రం నీలో ఉన్నా ఇంత తీవ్రమైన నిర్ణయం తీసుకొని ఉండే దానివి కాదు. తల్లి మాటలు వింటూ ఆలోచిస్తుంది విజేత. ఐతే తనకీ జీవితాన్ని ఇవ్వటం కోసం అమ్మ ఎంత త్యాగం చేసింది. ఆమె సర్వస్వమూ పోగొట్టుకొంది. పాతికేళ్ళ క్రితం అంటే అప్పుడే లింగ నిర్ధారణ పరీక్ష ప్రయోగశాలలు దాటి, బయటికి వచ్చే తొలిరోజులు. ఆ రోజుల్లో ఈ పరిక్ష అంటే ప్రాణభయం, ఉండేదట. నాన్న ఎంత మూర్ఖత్వంతో పుట్టబోయేది ఎవరన్నది నిర్ధారణ చేయించి ఉండాలి. అమ్మ సహించింది. ఆడపిల్ల వద్దుగాక వద్దని నాన్న అంటే ఆడదానిగా ఆగ్రహం పట్టలేక పోయింది. ఏటికి ఎదురొడ్డి తననింతదాన్ని చేసింది. తన భావాలు ఎంత సంకుచితమైనవి. విజేత మనసులో కమ్ముకున్న పొరలు ఒక్కోటి విడిపోసాగాయి. అమాంతం తల్లిపాదాలపై వాలిపోయింది. ఆ పవిత్ర పాదాలను కన్నీటిలో అభిషేకించింది. నువ్వు ముళ్ళ బాటలో నడిచి నాబతుకును పూలబాట చేశావమ్మా. నీలో దైవత్వం, మానవత్వం మూర్తీభవించి ఉన్నాయి. నా అవివేకానికి మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడుతున్నాను. క్షమించవూ? కూతురిలో ఆశించిన మార్పు వచ్చింది. అనుకున్న ఆ మాతృమూర్తి మరుక్షణం ఆ బిడ్డను తన అక్కున చేర్చుకుంది. ఇక నా ఆశయాలకు ప్రతిరూపమై చల్లగా వర్ధిల్లు! విజేత తలపై చేయి వేసింది. "నీ ఆశయాలకు ప్రతిరూపం నీ అల్లుడుగారమ్మా. నా ప్రవర్తనతో వారికి ఎంత కష్టం కలిగించాను. మీ ఇద్దరూ నన్ను మన్నిస్తే అంతే చాలు. శ్రీవారి కలల పంటను వారి చేతుల్లో ఉంచి నా జీవితాన్ని సార్థకం చేసుకుంటాను. అని తల్లికి మాట ఇచ్చి భర్తరాకకోసం ఒళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురు చూడ సాగింది విజేత. అల్లుడికి తను ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకోగలిగినందుకు సంతృప్తిగా నిట్టూర్చింది. కమల.

❑